ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 27 మార్చి 2024



మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.6°C | కనిష్ఠం : 20.4°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.35 గం..
సహర్ : గురువారం ఉ : 4.51 గం..

ఆత్మఘోష!

మూలనపడిన వ్యవసాయ సాంకేతిక పథకం



- మూడేళ్లుగా నిధులు రాక నీరసం
- రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు బ్రేక్
- ఇతర విధుల్లోకి ఆత్మసిబ్బంది..
- నీరుగారుతున్న పథకం లక్ష్యం





హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నిధులు లేక నీరసించిపోతోంది. ఎలాంటి కార్యక్రమాలు లేక నామావశిష్టంగా మారిపోయింది. పట్టించుకునేవారు లేక ఘోషిస్తోంది. ఆత్మ ఆధ్వర్యంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా ఎలాంటి కృషి జరగడం లేదు. యంత్రాలు కొనుగోలు చేసినప్పటికీ వాటిపై అవగాహన కల్పించేవారే లేరు. వరి, పత్తి, కందులు, పెసర, శనగ తదితర పంటలతో పాటు మామిడి, జామ, దానిమ్మ తోటలను పెంచుతున్నవారికి సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆత్మసంస్థను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆత్మ ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోతోంది.

శిక్షణే లక్ష్యం

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జిల్లా వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఆత్మ ఏర్పాటు చేశారు. ఒక విధంగా వ్యవసాయ శాఖలో ఆత్మ అంతర్భాగం. వ్యవసాయ శాఖ సిబ్బంది పంటల సాగు, విస్తీర్ణం, సస్య రక్షణ చర్యలు, పంటల సర్వే, పంట మార్పిడీపై అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను పర్యవేక్షిస్తే.. ఆత్మ వ్యవసాయరంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక మార్పులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియచెప్పడం ఆత్మ పని. 2006లో ప్రారంభమైన ఈ పథకం కింద కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి కన్వీనర్‌గా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. డివిజన్‌స్థాయిలో ఈ కమిటీలు ఉండేవి. అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులకు సాగుపై అవగాహన కల్పించేవారు. పశు సంవర్థక శాఖ, ఉద్యాన, మత్స్యశాఖల్లో సాంకేతికంగా వచ్చే అనేక మార్పులకు సంబంధించిన అంశాలు అధికారులు వివరించేవారు. ప్రస్తుతం ఇవేం జరగడం లేదు. ఇప్పుడు కమిటీలు కూడా ఏమీ లేవు. దీనికి ఇది వరకు చైర్మన్ కూడా ఉండేవారు. ఇప్పుడు ఎవరూ లేరు. దీంతో ఈ పథకం ఉందన్న విషయం చాలా మంది రైతులకు తెలియని పరిస్థితి. కార్యాలయం ఎక్కడ ఉంది? దానిలో ఎంత మంది పని చేస్తారు? వారి ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది? అనే అంశాలపై చాలా మంది రైతులకు ఇప్పటివరకు అవగాహన లేదు. మూడేళ్ల కిందట ఆత్మ చురుకుగానే పని చేసేంది. ఆ తర్వాత దాని కార్యక్రమాలు అటకెక్కాయి. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే ఒక మూల ఆత్మ పడి ఉంటోంది. ఇది వరకు బోర్డులైన ఉండేవి. ఇప్పుడు అవి కూడా లేవు.

ఊసేలేని కార్యక్రమాలు..

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్థక, పట్టు పరిశ్రమలు, మార్కెటింగ్ శాఖల భాగస్వామ్యంలో రైతులకు శిక్షణ, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రలు నిర్వహించాలి. వ్యవసాయ ప్రదర్శనలు, సాగు విస్తరణ కార్యక్రమాలు, పొలం బడులు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థ నిర్వహించే వ్యవసాయ, అనుబంధరంగాల కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారంతో ఆధునిక సాంకేతికతను రైతులకు అందించాలి. అవసరానికి అనుగుణంగా కొత్త విధానాలను విస్తరించడం, క్షేత్ర దినోత్సవాలను, కిసాన్ గోష్టి, రైతు-శాస్త్రవేత్తల గోష్టి లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. కానీ ఇవేమీ జరగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.30 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్క జొన్న, మిర్చితోపాటు మరో లక్ష ఎకరాల్లో పండ్లతోటలు, కూరగాయల తోటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పండుతున్నాయి. ఈ పంటల సాగులో ఇటీవల అనేక మెరుగైన పద్ధతులు వచ్చినా వాటి గురించి తెలియక రైతులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు.

సిబ్బంది ఉన్నా.. పని లేక..

ఆత్మకు జిల్లా వ్యవసాయాధికారే ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా వ్యవహరిస్తారు. డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ (డీపీడీ)తో పాటు ఒక ప్రోగ్రామ్ ఆపరేటర్, ఒక సీనియర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్ (ఏటీఎం), బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ (బీటీఎం) ఆత్మ సంస్థలో ఉంటారు. వీరిలో ఏటీఎం, బీటీఎంలు కాంట్రాక్టు ఉద్యోగులు కాగా మిగతా వారు రెగ్యులర్ సిబ్బంది. వీరు వ్యవసాయంలో చోటుచేసుకున్న ఆధునిక పద్ధతుల పట్ల రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. కానీ మూడేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుల కోసం ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించడం లేదు. టూర్ ప్రోగాంలు లేవు. క్షేత్ర సందర్శనలు అసలే లేవు. పొలం బాటలు ఏ మాత్రం కానరాడం లేదు. శాస్త్రవేత్తలతో రైతులకు ఇష్టాగోష్టి ఊసే లేదు.

మూడేళ్ల నుంచి నిధులు లేవు

రైతులు, వారి సంక్షేమం అంటూ ఊదరగొట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మను ఏ మాత్రం పట్టించుకోలేదు. మూడేళ్లుగా ఆత్మ పథకం కోసం ఒక్క పైసా ఇవ్వలేదు. గతంలో ఏటా రూ.5లక్షల వరకు నిధులు ఇచ్చేది. ఇతరత్రా వ్యవసాయ కార్యక్రమాలకు కూడా ప్రభుత్వం నుంచి నిధులందేవి. ఆ లెక్కన ఉమ్మడి జిల్లాకు రూ.30లక్షల వరకు వచ్చేవి. 2020 నుంచి నిధులు ఇవ్వడం నిలిపివేసింది. దీనితో నిధుల లేక ఆత్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం ఆగిపోయింది. మూడేళ్లలో ఒకే ఒక్క రైతు టూర్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు 50 మంది రైతులతో క్షేత్రసందర్శన నిర్వహించారు. అది కూడా వ్యవసాయశాఖ నిధులతోనే. ఆ తర్వాత రైతు అవగాహన కార్యక్రమాల ఊసే లేదు. ఆ మధ్య వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతులపై శిక్షణ కోసం ఆ మధ్య వ్యవసాయాధికారులతో బ్రెజిల్ పర్యటన నిర్వహించారు. అది కూడా వ్యవసాయశాఖ నిధులతో నిధుల లేక, చేసేందుకు పని లేకపోవడంతో కూడా ఇటీవల వ్యవసాయ శాఖలోకి ఏఈవోలుగా పంపించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

మహబూబాబాద్, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌తో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్ లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 461 గ్రామపంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణతో చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 49, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 125, జీసీసీ ద్వారా 7 ఇతర నాలుగు కలిపి మొత్తం జిల్లాలో 185 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్యాడి క్లీనర్, టార్పాలిన్లు, గన్నీస్ బ్యాగులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కస్టంమిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, డేవిడ్, జిల్లా అధికారులు ప్రసాద్, కృష్ణవేణి, మరియన్న పాల్గొన్నారు.

స్థానిక నాయకుల ఆంగీకారంతోనే చేరికలు

- మహబూబాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



కాంగ్రెస్‌లో పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న భూక్య మురళీనాయక్

గూడూరు, మార్చి 26 : కాంగ్రెస్ స్థానిక కార్యకర్తల అంగీకారంతోనే పార్టీలో చేరికలు ఉంటాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. దుబ్బగూడెంలో బీఆర్ఎస్‌కు చెందిన 150 మంది కార్యకర్తలు, నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరాలంటే స్థానికంగా ఉండే నాయకులు, కార్యకర్తలు వారి అభిప్రాయం మేరకే చేరికలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎవరైనా సరే పార్టీలో ఉంటూ పార్టీకి ద్రోహం చేసే కార్యకలాపాలు చేపడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను తన గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని చెప్పారు. వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈజీఎస్ పనుల తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శాంతి కుమార్

తొర్రూరు, మార్చి 26 : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, తదితర అంశాలపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల తనిఖీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఏపీడీ శాంతి కుమారి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టే పనులు, కూలీలకు చెల్లించిన డబ్బులు, ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నమోదు, తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. మండలంలోని 29 గ్రామాలకు గాను 12గ్రామాల్లో తనిఖీ పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను తనిఖీలు నిర్వహించి బుధవారం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సిలార్ సాహెబ్, కుమార్, ఏపీవో మధు, తనిఖీ బృందం, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలిగిస్తే చర్యలు

- అడవుల అభివృద్ధిపై చైతన్యకార్యక్రమాలు
- డీఎఫ్‌వో బి.విశాల్



భీమునిపాదంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న విశాల్

గూడూరు, మార్చి26 : వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని డీఎఫ్‌వో బి.విశాల్ హెచ్చరించారు. గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని భీమునిపాదం జలపాతంలో జరిగే అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న ప్లాంటేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధిపై అటవీశాఖ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అడవులు తగులబడడానికి తునికాకు కాంట్రాక్టర్లే కారణమని తమదృష్టికి వచ్చిందని చెప్పారు. అడవికి అగ్గిపెట్టడం ద్వారా వన్యప్రాణులు చనిపోతాయని, భూసారం దెబ్బతిని అడవుల పెరుగుదలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. అటవీశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతాల్లో సందర్శించి, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భీమునిపాదం అభివృద్ధి కోసం అటవీశాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి బి.సురేష్, డీఆర్వోలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసన్, సెక్షన్, బీట్ అధికారులు ఉన్నారు.

మానుకోట మునిసిపల్ వైస్ చైర్మన్‌గా వెంకన్న

- 34 మంది సభ్యులు అనుకూలంగా ఓట్లు
- మార్నేనితో ప్రమాణస్వీకారం చేయించిన ఆర్డీవో
- ఎన్నికకు దూరంగా సీపీఐ కౌన్సిలర్లు
- కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు





వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మార్నేని వెంకన్నకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి అలివేలు, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కౌన్సిలర్లు

మహబూబాబాద్ టౌన్, మార్చి 26 : మానుకోట మునిసిపల్ నూతన వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, 24వ వార్డు కౌన్సిలర్ మార్నేని వెంకన్న మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు అనూకూలంగా ఎక్స్‌అఫిషియో సభ్యులు, స్థానిక ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు 32మంది కౌన్సిలర్లు ఓటు వేశారు. ఈ ఎన్నికకు తాజామాజీ వైస్‌చైర్మన్ ఫరీద్, సీపీఐ ఇద్దరు కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. వైస్‌చైర్మన్‌గా వెంకన్న ఒక్కరే పోటీ చేయడం, 34 మంది సభ్యులు అతనికి అనుకూలంగా ఓటు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అలివేలు ప్రకటించారు. గత మునిసిపల్ వైస్ చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాసం పెడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు 29మంది సంతకాలు చేసి ఫిబ్రవరి 12న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ప్రతిని అందచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 4న మధ్యాహ్నం 3 గంటలకు మునిసిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ, ఎక్స్ అఫిషియో సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం పార్టీలకు చెందిన 30 మంది మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో వైస్ చైర్మన్ ఫరీద్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో అలివేలు ప్రకటించారు. తిరిగి మునిసిపల్ నూతన వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు మంగళవారం ఉదయం 11గంటలకు మునిసిపల్ పాలకమండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్రఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఉత్తర్వులను జారీ చేశారు.

కొత్త వైస్‌చైర్మన్ ఎన్నిక జరిగిందిలా..

మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయగా, 10.30 గంటల నుంచి సభ్యులు ఒక్కొక్కరు కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా, అందులో ఒక్కరు చనిపోగా 35 మంది సభ్యులున్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు 22 మంది, కాంగ్రెస్‌కు 9 మంది, సీపీఐకి ఇద్దరు, సీపీఎంకు ఇద్దరు సభ్యులున్నారు. ఎక్స్‌అఫిషియో సభ్యులు ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డితో సహా 32 మంది కౌన్సిలర్లు వెరసీ మొత్తంగా 34 మంది ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. సీపీఐ కౌన్సిలర్లు ఇద్దరు, తాజామాజీ వైస్ చైర్మన్ ఫరీద్ సమావేశానికి హాజరుకాలేదు.

కాగా, బీఆర్ఎస్‌కు చెందిన 24వ వార్డు కౌన్సిలర్ మార్నేని వెంకన్నను వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి ప్రతిపాదించగా, సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య బలపర్చారు. వైస్‌చైర్మన్‌గా వెంకన్న ఒక్కరే పోటీ చేయడం 34 మంది సభ్యులుఅతనికి మద్దతుగా చేతు లెత్తడంతో ఎకగ్రీవంగాఎన్నికైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో అలివేలు ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వెంకన్నకు నియామకపత్రాన్ని అందించి ప్రమాణస్వీకారం చేయించారు. పార్టీల కతీతంగా తన ఎన్నికకు సహకరించిన వార్డు కౌన్సిలర్లకు నూతనంగా వైస్ చైర్మన్ వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు.

తన ఎన్నిక విషయంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ కవిత ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కమిషనర్ నోముల రవీందర్, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలతోనే లాభాలు

వ్యవసాయ శాస్త్రవేత్త, అగ్రనమి హెడ్ గోవర్ధన్



నర్సింహులపేట రైతువేదికలో జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి26 : వ్యవసాయ పంటలతో పాటు ఆ రంగానికి అనుబంధంగా ఉన్న ఇతర వనరులను ఉపయోగించుకుని, అధిక లాభాలను పొందాలని హైదరాబాద్ అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం ప్రధాన శాస్త్రవేత్త (అగ్రనమి) హెడ్ ఎం.గోవర్ధన్ సూచించారు. జిల్లాలోని మహబూబాబాద్, నర్సింహులపేట మండలంలోని రైతు వేదికల్లో మంగళవారం శాస్త్రవేత్తలతో 'రైతునేస్తం' ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకం లాంటి అనుబంధ రంగాలతో పాటు పట్టుపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తద్వారా అధిక లాభాలు గడించవచ్చని పేర్కొన్నారు.

వరి పరిశోధన సంస్థ (కీటకశాస్త్రం) ప్రధాన శాస్త్రవేత్త ఎన్.రామగోపాల్‌వర్మమాట్లాడుతూ వ్యవసాయంలో నేడు కూలీల కొరత ఎక్కువగా ఉందని, ఆ కొరతను నివారించడానికి, కూలీలకు ఇచ్చే నగదును మిగులుబాటు చేసుకునేందుకు డ్రోన్ల సహకారంతో క్రిమిసంహారిక మందులు పిచికారి చేసుకోవాలన్నారు. మహబూబాబాద్ రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ సంచాలకుడు కె.లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి, బయ్యారం వ్యవసాయాధికారి రాంజీనాయక్‌తో పాటు నర్సింహులపేటలో జరిగిన ప్రత్యక్ష ప్రసారం మండల వ్యవసాయాధికారిరామకృష్ణ, తొర్రూరు మండల వ్యవసాయాధికారి కుమార్‌యాదవ్‌తో పాటు ఈ రెండు మండలాల ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై శిక్షణ...

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన పరిశోధన సంస్థ సాంకేతిక విభాగం సహకారంతో జిల్లాలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వరి, కంది, వేరుశనగ, ఇతర పంటల్లో నాణ్యమైన విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌టీసీ, పీజేటీఎస్ఏవో సీనియర్ శాస్త్రవేత్త సుకుమార్, మరో సీనియర్ శాస్త్రవేత్త వి.స్వర్ణలత, మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మాలతితో పాటు ఇతర శాస్త్రవేత్తలు, రైతులు, ఎఫ్‌పీవో వలంటీర్లు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పోను నియమించారు. ఈమేరకు కలెక్టర్ అద్వైత్‌కమార్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఆర్‌డీఏ పీడీగా పని చేసిన పురుషోత్తం గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పని చేసిన సమయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ఆయన్ను ఈనెల 22న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. పట్టణ శివారు ప్రాంతానికి చెందిన బాలిక (9) విద్యనభ్యసించేందుకు పాఠశాలకు వెళ్లివస్తున్న క్రమంలో ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ఓ యువకుడు (21) సదరు విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. సదరు బాలిక ఫొటోను సంపాదించిన అతడు ఇన్‌స్టాగామ్‌లో పెట్టడంతో ఆమె తల్లిదండ్రుల దృష్టికి వచ్చింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు యువకు డిపై విచారణ జరిపి పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి విలేకరులకు చెప్పారు.

వినాయక్‌నగర్‌లో మహిళ అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 26: మతిస్థిమితం లేని మేకల లక్ష్మి(34) అనే మహిళ అదృశ్యం అయిన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్‌పరిధిలోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మి సోమవారం అర్థరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ విషయాన్ని కేయూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ ధ్రువీకరించారు. లక్ష్మి మామ మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని తీస్తున్న సిబ్బంది

రెడీమిక్స్ వాహనం బోల్తా

డ్రైవర్‌కు స్వల్పగాయాలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: హనుమకొండ కేయూ రోడ్డులోని ఈదులవాడు బ్రిడ్జి కింద మురుగుకాల్వలో రెడీమిక్స్ వాహనం బోల్తా పడింది. వాహనం నడుపుతున్న డ్రైవర్ బయట దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ బొక్కలగడ్డ నుంచి ఈదులవాగు ఇటీవల వరద నీరు ఉధృతం కావడంతో ఇళ్లలోకి నీరు చేరుకున్నాయి. అధికారులకు ప్రజలు మొరపెట్టుకోవడంతో మురుగు నీటి కాల్వను వెడల్పు చేసే పనిలో పడ్డారు. అంతేకాకుండా ప్రధాన ముగురుకాల్వ పక్కన ఎత్తుగా ప్రహరీని నిర్మిస్తున్నారు. ఈ గోడ నిర్మాణ పనులు చేసేందుకు మంగళవారం కాల్వలోకి టిప్పర్‌లు, లారీలతోపాటు రెడీమిక్స్ వాహనాన్ని కూడా దింపారు. అయితే రెడీమిక్స్‌లో కంకర కలిపి పోస్తుండగా ఎక్కువ బరువును తట్టుకోలేక బురదలో కుంగిపోయి బోల్తా కొట్టింది. ఇది గమనించిన చట్టుపక్కల వాళ్లు కేకలువేశారు. వెంటనే ప్రమాదాన్ని గమనించి డ్రైవర్ వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులు గమనించి ప్రమాదంలో ఎవరూ చిక్కకుండా చొరకవ చూపారు. వెంటనే క్రేన్ సహాయంతో పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని నిలబెట్టారు. ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా, ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

వడ్డెపల్లి, మార్చి 26 : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువును ఏప్రిల్ 9 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ : 73309 90322 లో సంప్రదించాలని ఆయన కోరారు.

30న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో మార్చి 30న శనివారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ అకడమిక్ సెనెట్ సభ్యులు, డీన్లు, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు హాజరుకావాలని కోరారు. కాగా, గతంలో మార్చి 28న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం ఉంటుందని ప్రకటించి అనివార్యకారణాల వల్ల 30కి వాయిదా వేశారు.

పలువురికి జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి26: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ 12 మంది వాహనదారులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 10 మందికి జరిమానా విధించారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.14,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో 10 మందికి రూ.8,800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. అదే విధంగా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 10 మంది మైనర్లకు రూ.9,700 జరిమానా విధించామన్నారు.

రాజనీతిశాస్త్ర విభాగాధిపతిగా సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర నూతన ఇన్‌చార్జి విభాగాధిపతిగా కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ సంకినేని వెంకట్‌ను నియామిస్తూ మంగళవారం కేయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సంకినేని వెంకట్ 2004లో రాజనీతిశాస్త్ర విభాగంలో పార్టుటైమ్ అధ్యాపకులు నియమితులయ్యారు. 2009లో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. డాక్టర్ వెంకట్ జాతీయ సదస్సుల్లో 12 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఇప్పటి వరకు రాజనీతిశాస్త్ర విభాగం ఇన్‌చార్జి విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ కె.వీరా స్వామి తప్పుకోవడంతో ఖాళీ ఏర్పడింది. నూతన విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మార్చి 27న రాజనీతిశాస్త్ర విభాగంలో బాధ్యతలు చేపడుతారు. నూతన విభాగాధిపతిగా నియమితులైన డాక్టర్ సంకినేని వెంకట్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకలు అభినందించారు.

టెట్.. హాట్ గురూ..

- 5 రెట్లు పెరిగిన దరఖాస్తు ఫీజు
- భారీగా పెరిగిన ఫీజుతో బెంబేలెత్తిపోతున్న అభ్యర్థులు
- ఈ సారి టెట్‌లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అవకాశం
- ప్రత్యేక టెట్ నిర్వహించాలని అంటున్న ఇన్‌సర్వీస్ టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 26: టెట్ దరఖాస్తు ఫీజు అభ్యర్థులకు త్రెట్‌గా మారింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉపాధ్యాయ ఉద్యోగార్థులను ఉసూరుమనిపిస్తోంది. గతంతో పోలిస్తే దరఖాస్తు ఫీజును ప్రభుత్వం 5రెట్లు పెంచడంతో దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు. గత ప్రభుత్వం టెట్ ప్రకటనల్లో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు దరఖాస్తు ఫీజులో రాయితీలు ప్రకటిస్తే ఇప్పుడు మాత్రం ప్రభుత్వం మొండిచేయి చూపడంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. భారీగా ఫీజు పెంచడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈసారి టెట్‌లో ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం కల్పించారు. పదోన్నతుల కోసం ప్రభుత్వం ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌లో అర్హత సాధించాలనే నిబంధన పెట్టడంతో వారికి టెట్ తిప్పలు తప్పడం లేదు. అయితే రెగ్యులర్ వారితో కాకుండా పని చేస్తున్న పంతుళ్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెరిగిన దరఖాస్తు ఫీజు


గతంతో పోలిస్తే టెట్ దరఖాస్తు ఫీజును ఈ సారి ప్రభుత్వం 5 రెట్లు పెంచింది. గతంలో దరఖాస్తు ఫీజు రూ.300ఉండగా, రెండు పేపర్లు రాయాలనుకునే అభ్యర్థులు రూ.400 చెల్లించేవారు. అయితే ఇప్పుడు మాత్రం కేవలం దరఖాస్తుకే వెయ్యి రూపాయలతో పాటు అదనంగా పేపర్‌కు మరో వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు ప్రతీ దరఖాస్తులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఇవ్వాల్సిన రాయితీని సైతం ప్రకటించ లేదు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు సాధారణ అభ్యర్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు దరఖాస్తులు చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీగా పెంచిన ఫీజులను ప్రభుత్వం తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ ఏడాది ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం

ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత సాధించాలని నిబంధలను ప్రభుత్వం విధించడంతో వారికి టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. దీంతో టెట్ నోటిఫికేషన్‌లో పనిచేస్తున్న పంతుళ్లకు ఈ సారి టెట్ రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి..

బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారితో తమకు టెట్ రాయడం సాధ్యం కాదని పనిచేస్తున్న పంతుళ్లు చెబుతున్నారు. వారి కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఎడ్, డీఎడ్ విద్యార్థులు టెట్‌ను తేలికగా రాసే వీలుంటందని, పనిచేస్తున్న పంతుళ్ల వారితో పోటీగా పరీక్ష రాసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కొన్నేళ్ల కిందట ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసి ప్రస్తుతం ప్రభుత్వం బడుల్లో పనిచేస్తున్న పంతుళ్లు ఎలా రాస్తారనే వాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే నిష్ణాతులుగా ఉంటారని అయితే అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుందనే అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు



ఫీజులో రాయితీని ఇవ్వాలి..



వల్లాల ముకుందం, హనుమకొండ, అభ్యర్థి

టెట్ దరఖాస్తు ఫీజులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రాయితీని ప్రకటించాలి. గత టెట్ పరీక్షకు ప్రభుత్వం ఫీజు రాయితీని ప్రకటించింది. ప్రభుత్వం టెట్ ఫీజుకు రాయితీని కల్పించి బలహీన వర్గాల విద్యార్థులు టెట్‌కు దరఖాస్తులు చేసుకునేలా చేయాలి.

ఫీజు తగ్గించాలి..



బి. మమత, టెట్ అభ్యర్థి, హనుమకొండ

టెట్ దరఖాస్తుకు ప్రభుత్వం భారీగా ఫీజులు పెంచింది. నిరుద్యోగులమైన మా దగ్గర వేలకు వేలు దరఖాస్తు ఫీజులు వసూల్ చేయడం సరికాదు. ఉద్యోగాలు రాకే ఇప్పటికే వయస్సు మించి పోతున్నది. ఇప్పుడు అధిక ఫీజులతో దరఖాస్తుకు దూరం చేయొద్దు.

మార్కుల కోసం రాసేవారికి గుదిబండ

చంద్రగిరి సునిల్‌కుమార్, తెలంణాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం



టెట్‌కు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు టెట్ ఫీజుభారంగా మారింది. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కుల కోసం మరోసారి టెట్ రాయాలనకునే అభ్యర్థులకు ఫీజు గుదిబండగా మారింది. ఎస్సీ, ఎస్టీ, వికాలంగులకు ఫీజులో రాయితి కల్పించాలని, ఫీజు తగ్గించాలి.

ఇన్‌సర్వీస్‌కు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

గుర్రపు రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి టెట్ రాయడం ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుంది. ఎప్పుడో చదివిన ఉపాధ్యాయులు ఇప్పుడు పరీక్ష రాయడం ఇబ్బందిగానే ఉంటుంది. అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ఉపాధ్యాయులకు కష్టంగానే ఉంటుంది.

ఎమ్మెల్యే నాయినిని కలిసిన ఐఆర్ఎస్ అధికారి అపూర్వ



కేయూ క్యాంపస్, మార్చి 26: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ ప్రాంతానికి చెందిన మహారాష్ట్ర ఐఆర్ఎస్ అధికారి మంద అపూర్వ మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. కేయూ రిటైర్డు ఎకానమిక్స్ విభాగం ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్ కూతురు అపూర్వ ఐఆర్ఎస్ సాధించడంపై ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నాయిని కలిసిన వారిలో ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్, మంద అభినవ్‌లున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట, మార్చి 26: కాజీపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలో మంగళవారం ఉదయం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 55 నుంచి 60 యేళ్లు ఉంటాయని, తెలుపు రంగు, పొడవు ముఖం, తెల్ల గడ్డం, బ్లూ గీతల షర్ట్, వైట్ కలర్ లైనింగ్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు లిఫ్ట్ పక్కనే పడుకుని నిద్రలోనే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి జేబులో కళ్యాణ్ జంక్షన్ నుంచి కాజీపేట అనే రైలు టిక్కెట్ ఉంది. గుర్తించడానికి ఇతరత్రా ఏ ఆధారాలు లేవు. ప్రయాణికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబరు 87126 58609, 99498 59108 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎస్.శ్రీనివాస్ (ఫైల్)

కాజీపేట, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట విష్ణుపురికి చెందిన ఎస్.శ్రీనివాస్ (47) ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న రహ్మత్‌నగర్‌లో రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఎస్.పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాజనీతిశాస్త్రంలో మాధవికి డాక్టరేట్



మాధవి

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయా యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకురాలు కె.మాధవికి డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ డిస్లెస్‌మెంట్: ఏస్టడీ ఆఫ్ ఇరిగేషన్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ జి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో మాధవి డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన మాధవి హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మాధవిని పలువురు అభినందించారు.

చరిత్రవిభాగంలో అనితకు..



ఈ. అనిత

కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకురాలు ఈదులకంటి అనితకు డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'ద రోల్ ఆస్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్టిస్ట్ మూమెంట్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై కేయూ చరిత్ర విభాగం ప్రొఫెసర్ పి.సదానందం పర్యవేక్షణలో అనిత డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన అనిత హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రవిభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అనితను పలువురు అభినందించారు.

జేఎన్‌యూలో ప్రొఫెసర్ రామేశ్వరం ప్రసంగం

కేయూ క్యాంపస్, మార్చి 26: కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరంనకు అరుదైన అవకాశం లభించింది. 18-20 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో 8వ ప్రపంచ కాన్సర్ కాంగ్రెస్ -2024 కాన్వకేషన్‌లో ప్రసంగించారు. నేచర్ క్యూర్ మెదడ్స్ ఇన్ ది మేనేజ్‌మెంట్ ఆఫ్ కాన్సర్- టూ సెంచరీస్ హిస్టోరికల్ ఎవిడెన్సెస్ ఆఫ్ ది వరల్డ్ అనే అంశంపై విస్తృత కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కేయూ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ప్రసంగం విశేషాలను వీసీ రమేశ్‌తో పంచుకుని తనకిచ్చిన ప్రశంసాపత్రాన్ని ప్రదర్శించారు.



కేసీఆర్ బొకే ఇస్తున్న కావ్య

కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య

రాంనగర్, మార్చి 26: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య టీఆర్ఎస్ అధినే త, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మం గళవారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కావ్య కలిసి తనపై నమ్మకంతో వరంగల్ బీఆర్ఎస్ టికెట్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని కడియం కావ్యను ఈ సందర్భంగా కేసీఆర్ ఆశీర్వదించారు.

రావు పద్మను కలిసిన ఆరూరి రమేశ్



పద్మకు బొకే ఇస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, మార్చి26: బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను మంగళవారం వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ హంటర్‌రోడులోని పద్మ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావు పద్మ అమరేందర్‌రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. పద్మ భర్త అమరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కొమ్మాలకు వచ్చిన బీజేపీ నాయకులు

భక్తజన సంద్రంగా కొమ్మాల జాతర

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు ● హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు ● గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు పడిన కొమ్మాల జాతర భక్తులు ● లక్షమందికి పైగా దైవదర్శనం చేసుకున్న భక్తులు

గీసుగొండ/దుగ్గొండి, మార్చి 26: వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు రెండోరోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తుల తాకిడితో భక్తజన సంద్రంగా మారింది. దాదాపు లక్షపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో శేషగిరి తెలిపారు. ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో కూడా భక్తుల రద్దీ కనబడింది. వరంగల్ తదితర ప్రాంతాల నుంచి నుంచి ఎడ్ల బండ్లపై వచ్చిన భక్తులు రోడ్ల పక్కనే విడిది చేశారు. వరంగల్ నుంచి జాతర వరకు ఎండ్లబండ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోడ్ ఉన్న నేపథ్యంలో డీసీపీ, ఏసీపీలు రాజకీయ ప్రభలపై విధించినా, రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. ప్రభలకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, సీఎం, ఎమ్మెల్యేల ఫొటో కటౌట్‌లు ఏర్పాటు చేసుకొని డీజేలతో అట్టాహాసంగా తరలివచ్చారు. ప్రభల తరలింపులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తింది. పోలీసులు తక్షణమే స్పందించి ఇరుపక్షాలను శాంతింపచేశారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట, సంగెం మండలాలు నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంసీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన రాజకీయ ప్రభలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. ప్రభలకు, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎస్ఐలు పర్యవేక్షించారు.

గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్

రాజకీయ ప్రభబండ్ల భారీగా తరలిరావడంతో దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు జాతరకొచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సోమవారం ప్రారంభం కాగా.. మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, ఎంసీపీఐ(యూ) పార్టీలు పోటాపోటీగా ప్రభబండ్లను రూపొందించాయి. కాంగ్రెస్ ప్రభబండిని నర్సంపేట్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బీఆర్ఎస్ ప్రభను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. వాటితో పాటు చెన్నారావుపేట, నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ మండలాలకు చెంది న ప్రభబండ్లు కూడా గిర్నిబావి కేంద్రానికి చేరుకొని డప్పుచప్పుళ్లు, డీజే పాటలు, కోలాటం, ఆటపాటలతో ర్యాలీగా జాతరకు తరలాయి. ఈ క్రమంలో గిర్నిబావి ప్రధాన రహదా రిపై ట్రాఫిక్ స్తంభించింది. అటు జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడగా.. బీఈడీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లడం కనిపించింది. అలాగే వరంగల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను నాచినపల్లి నుంచి లక్నీపురం, మచ్చాపురానికి మళ్లించారు. డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు రాజగోపాల్, రమణమూర్తి, చంద్రమోహన్‌లతోపాటు సబ్ డివిజన్ ఎస్సైలు జక్కుల పరమేశ్, రఘుపతి, రామారావు, గాదె అరుణ్‌కుమార్‌లతో సీఆర్‌పీ పోలీసులు గిర్నిబావి రహదారికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



జాతరకు వస్తున్న రాజకీయప్రభలు

ఎర్రగట్టు జాతరలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్ దంపతులు

హసన్‌పర్తి, మార్చి 26: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి జాతరలో రెండో రోజు మంగళవారం భక్తులు వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారదాచార్యులు, ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఉదయం స్వామివారికి పూజలు, పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చిన్న చక్రముల బండ్లు తిరిగాయి. జాతరలో వెలిసిన దుకాణాల్లో భక్తుల సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. విశ్వక్సేన సేవా సమితి ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, దర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, పెద్దమ్మ సురేష్, జన్ను శైలజ, సంపత్ యాదవ్, విశ్వక్సేన సమితి సభ్యులు పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న డీడీ ఎర్రయ్య

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● ఐటీడీఏ డీడీ మంకిడి ఎర్రయ్య

కొత్తగూడ, మార్చి 26 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ డీడీ మంకిడి ఎర్రయ్య సూచించారు. కొత్తగూడ మండల కేంద్రంలో మంగళవారం మోడల్ స్పోర్ట్స్ స్కూల్లో ఉమ్మడి జిల్లాస్థాయి వివిధ క్రీడలకు ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేవదాసు, ఎస్‌వో మోహన్‌నాయక్, పీడీలు కొమ్మాలు, వెంకన్న, నాగేశ్వర్‌రావు, రమేష్, వెంకట్, విజయలలిత, దేవేందర్, ప్రవీణ్, కోచ్‌లు సుధీర్, ధనాజీ పాల్గొన్నారు.

నేడు గోపాలపురానికి పొంగులేటి రాక

గార్ల, మార్చి26 : మండలంలోని గోపాలపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశీతల పరమేశ్వరి నాభిశిల బొడ్రాయి, ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు బుధవారం రెవెన్యూ గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేస్తారని జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న మహిళకు జైలు

మరిపెడ, మార్చి26 : ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న ఒకరికి తొర్రూరు కోర్టు న్యాయాధికారి మట్ట సరిత ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా మంగళవారం విధించారు. ఎస్సై తహెర్ తెలిపిన వివరాల ప్రకారం. మరిపెడ బంగ్లాకు చెందిన బండి వేణు సర్వే నంబరు 469లోని తన 151 గజాల ఇంటి స్థలంలో నిర్మాణ పనులు చేపడుతుండగా, నాసర్ల ఎలమంచమ్మ అడ్డుకున్నారు. బండి వేణు స్థానిక పీఎస్‌లో 2014 సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై ఆర్.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేశ్ఆనంద్ కేసు వాదించగా, సాక్షులను కోర్టు కానిస్టేబుల్ రాంనారాయణ తొర్రూరు కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపర్వాలు పరిశీలించిన తొర్రూరు కోర్టు న్యాయాధికారి మట్ట సరిత నిందితురాలు ఎలమంచమ్మకు సంవత్సరం జైలు శిక్ష విధించారు. రాంనారాయణను తొర్రూరు డీఎస్పీ సురేశ్, సీఐ హతిరాంనాయక్, ఎస్సై తహెర్ ప్రశంసించారు.

సీజ్ చేసిన మద్యం అక్రమంగా తరలింపు?

తొర్రూరు, మార్చి 26 : ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివిధ బెల్టుషాపుల్లో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్‌చేసి, కార్యాలయంలో నిల్వఉన్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు వైన్స్‌షాపులకు తరలించి విక్రయాలనే వీడియోలు గత రాత్రి నుంచి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ఎన్నికల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా సిబ్బంది సహకారంతో ఎస్సై స్థాయి అధికారి విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎక్సైజ్ ఎస్సై రవళిని వివరణ కోరగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. జిల్లా ఉన్నతాధికారి కిరణ్‌నాయక్‌ను వివరణ కోరగా సోషల్ మీడియాలో వీడియోలు వచ్చాయని, తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామన్నారు.

'ఆదివాసీలు ఎన్నికల్లో అస్థిత్వాన్ని చాటాలి'

కొత్తగూడ, మార్చి 26 : రాబోయే మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో ఆదివాసీలు తమఅస్థిత్వాన్ని చాటాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. కొత్తగూడలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బూర్జువ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు తమపై కొనసాగిస్తున్న రాజకీయ కుట్రలను ఆదివాసీలు తమ ఓటుద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంజ నర్సింగరావు, కృష్ణ, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, మధుకర్, నగేష్ పాల్గొన్నారు.

ఆ కర్రలే.. కరెంట్ స్తంభాలు.!

● వేలాడుతున్న విద్యుత్ వైర్లు.. ఆందోళనలో రైతులు

● సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

గూడూరు, మార్చి 26 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు లేవు. దీంతో కర్రలనే స్తంభాలుగా ఏర్పాటు చేసుకుని వ్యవసాయ డిమెస్టిక్ కనెక్షన్‌లను పొందుతున్నారు. ఫలితంగా కరెంట్ వైర్లు ప్రమాదకరంగా క్రిందకు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గాలిదుమారానికి కర్రలు కిందపడిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.

పలు గ్రామాలలో ఇదే పరిస్థితి..

మచ్చర్ల, దామెరవంచ, బొద్దుగొండ, ఎర్రకుంటతండా, రాజన్‌పల్లి, గాజులగట్టు, సీతనగర్, చిన్న ఎల్లాపురం, తదితర గ్రామాల్లో కర్రల సాయంతో ఏర్పా టు చేసుకున్న విద్యుత్ తీగలు కిందకు వేలాడుతోం డడంతో అటువైపుగా వెళ్తున్న రైతులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతోందోనని ప్రాణాలను



మచ్చర్ల గ్రామశివారు పాటిమీదిగూడెం వ్యవసాయ క్షేత్రాలలో కర్రెల మీదుగా కరెంట్ వైర్లు దృశ్యం

అరిచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ఈ రోజుల్లో కరెంట్ రెప్పపాటున పోతే హైరానాపడుతున్నారు. కానీ, అలాంటిది ఈ ప్రాంతాల్లో రైతులకు కరెంట్ సరఫరా సమస్య ఉంది. వ్యవసాయ పొలాల్లో ఈ పరిస్థితి దారు ణంగా ఉంది. వ్యవసాయ బావులవద్ద ఉన్న మోటార్ల వద్దకు కనెక్షన్ రావాలంటే దాదాపు కిలోమీటర్‌పైనే కర్రల సాయంతో విద్యుత్ కనెక్షన్ తీసుకుంటున్నారు. సరిపడ విద్యుత్ స్తంభాలులేక సర్వీస్ వైర్లు అన్ని కర్రలనే స్తంభాలుగా ఏర్పాటుచేసుకుంటున్నారు. ప్రమా దమని తెలిసిన ప్రజలు ఏం చేయలేని పరిస్థితి ఉంది. క్రిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్ల కింద నుంచే రాక పోకలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన విద్యుత్‌శాఖ అధికారులు కర్రెల స్థానంలో సిమెంట్ పోల్‌తో కూడిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

చిరుధాన్యాల వంటకాల తయారీపై శిక్షణ

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 26 : రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవకేంద్రం నిర్వాహణలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే చిరుధాన్యాల వంటకాల తయారుపై శిక్షణలో పాల్గొనేందుకు మహబూబాబాద్ జిల్లా నుంచి అధికమంది రైతులు పాల్గొనాల్సిందిగా రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కారగ్రహీత యడ్లవల్లి వేంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ఆహార అలవాట్లు అనేక అనారోగ్య సమస్యలకు, వ్యాధులకు కారణమవుతున్నందున ఈ సమస్యకు పరిష్కారంగా సేంద్రీయ వ్యవసాయ విధానంలో పండించిన చిరుధాన్యాలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, అండు కొర్రలతో చేసే అనేక రకాల వంటకాలలో తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా తెలియజేస్తారని చెప్పారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణ కార్యక్రమంలో మిల్లెట్ భోజన సౌకర్యం కలదని చెప్పారు. జిల్లా నుంచి అత్యధికంగా రైతులు ఈ శిక్షణలో పాల్గొనాలని సూచించారు.

కార్మిక పాలసీని రాష్ట్ర సర్కార్ ప్రకటించాలి

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

మహబూబాబాద్ టౌన్, మార్చి 26 : రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి సంపదను సృష్టిస్తున్న కోటిమందికి పైగా ఉన్న కార్మికులకు ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కోరారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం ఆకుల రాజు అధ్యక్షతన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిందని, ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక పాలసీని ప్రకటించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ తరఫున ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు చెప్పారు. రాష్ట్ర సీనియర్ నాయకులు పి.రాజారావు, ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, ఆఫీస్ బేరర్స్ సమ్మెట రాజమౌళి, కందునూరి శ్రీనివాస్, కుమ్మరికుంట్ల నాగన్న, పోతుగంటి మల్లయ్య పాల్గొన్నారు.

రేపు టీడబ్ల్యూజేఎఫ్ ద్వితీయ జిల్లా మహాసభ

మహబూబాబాద్ టౌన్, మార్చి 26 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రాజీవ్‌నగర్‌కాలనీలో జర్నలిస్టు షోయబుల్లాఖాన్ ప్రాంగణంలో ఈనెల 28న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా ద్వితీయ మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ మహాసభకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి.ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్,రాష్ట్రనేతలు అనిల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ హాజరవుతున్నారని చెప్పారు. సంఘం ప్రతినిధులు, జర్నలిస్టులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు గ్రూప్స్ ఉచిత శిక్షణ కోసం ధ్రువపత్రాల పరిశీలన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 26 : జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు గ్రూప్-1 ఉద్యోగ నియామకాల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన ఈ నెల 28న ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు మంగళవారంతెలిపారు. దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఉంటే ఆన్‌లైన్ www.tsstudycircle.co.in దరఖాస్తు చేసుకుంటే 28న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్ స్లిప్ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం, సెల్ నెంబర్ : 94401 20620ను సంప్రదించాలన్నారు.

'బుద్దారం తండాలో నాటుసారా తయారీని అరికట్టాలి'

గార్ల మార్చి 26 : మండలంలోని బుద్దారంతండాలో పేదలజీవితాలను చిందరవందర చేస్తున్న నాటుసారాను తయారి అరికట్టాలని కోరుతూ డోర్నకల్ చెందిన దాసరి నానియాదవ్ మంగళవారం ఎస్సై జీనత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బుద్దారం తండాలో నాటుసారా తయారీ కుటీర పరిశ్రమగా సాగుతుందని, దీంతో అనేక కుటుంబాల్లో విషాదం నెలకొందని దీనిపై స్థానిక పోలీసులతో పాటు జిల్లా అధికారులు దృష్టి సారించి, అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'ఎండకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి'

నెహ్రూసెంటర్, మార్చి26 : ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండ తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) కళావతిబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో వడదెబ్బకు గురైనప్పుడు శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం తగ్గిపోవడం, మూత్రం పసుపురంగులో రావడం, పాక్షిక, అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ప్రజలు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన ప్రజలు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు.

అన్నాతమ్ముళ్లపై కేసు నమోదు : సీఐ

● జర్నలిస్టులమని చెప్పుకుంటూ అక్రమ వసూళ్లు

నర్సింహులపేట, మార్చి 26 : మండలంలో జర్నలిస్టులమని చెప్పుకుంటూ అక్రమ వసూళ్లు చేస్తున్న అన్న, తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు తొర్రూరు సీఐ సంజీవ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని నర్సింహాపురం బంజర గ్రామానికి చెందిన మేకరబోయిన నాగేశ్వర్ అతని తమ్ముడు బ్రహ్మేష్ కొంతకాలంగా జర్నలిస్టుగా చెప్పుకుంటూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 16న రాత్రి నర్సింహులపేట నుంచి పడమటిగూడెం వైపు ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా, పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ రమేష్‌కు ట్రాక్టర్ తారసపడిందన్నారు. ట్రాక్టర్‌ను ఆపి పర్మిషన్ అడుగగా సదరు కానిస్టేబుల్‌తో తాము విలేక రులమని, ఆ వాహనం తమదేనని, పర్మిషన్ తమకెందుకని దురుసుగా వ్యవహరించి, దౌర్జన్యం చేసినట్లు వివరించారు. అంతే కాకుండా నల్లబెల్లం వ్యాపారుల నుంచి బ్లాక్‌మెయిల్ వసూళ్లకు పాల్పడడంతోపాటు పోలీస్, వివిధ శాఖల అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారిద్దరిపై ఇదివరకు పలు నేరఆరోపణలు ఉన్నట్లు రికార్డుల ప్రకారం తెలిసినట్లు తెలిపారు. నర్సింహులపేట ఎస్సై సతీష్ నిందితులపై చేయి చేసుకోవడం సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని సీఐ తెలిపారు. చట్ట విరద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారిపైనా వదిలేదిలేదని ఆయన హెచ్చరించారు.

వెన్నారంలో నకిలీ విలేకరుల హల్‌చల్

● డోర్నకల్ : మండలంలోని వెన్నారంలో మంగళవారం కొందరు నకిలీ విలేకరులు హల్‌చల్ చేసి, ప్రజల చేతిలో అభాసుపాలయ్యారు. వివరాల్లోకెళ్తే.. ఖమ్మంకు చెందిన కొందరు తాము యూట్యూబ్ విలేకరుల మంటూ వెన్నారం చెందిన ఓ రేషన్ డీలర్ వద్దకు వెళ్లి తమకు చందా ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఉయ్యాలవాడకు చెందిన రేషన్‌డీలర్ మేదరమెట్ల సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. వారిని గట్టిగా నిలదీశారు. మీరు విలేకరులు అయితే చందాలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఈ లోగా ప్రజలు అక్కడ గుమికూడి వారిపై చేయి చేసుకునేంత పని చేశారు. దీంతో వారు మాదితప్పే, మమ్ముల్ని క్షమించండి అనే ప్రాధేయపడ్డారు. దీంతో వారిని అక్కడ్నుంచి పంపించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

తొర్రూరు, మార్చి 26 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు కె.యాకయ్య అన్నారు. తొర్రూరులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా కేంద్రంలో జరిగే రెండో మహాసభకు యూనియన్ నాయకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రామకృష్ణ, నాగరాజు, శేఖర్, సారయ్య రమేష్ పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో వసంత ఉత్సవ (హోలీ) పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనంతాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి26 : జిల్లా కేంద్రం శివారు అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 21న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక దేవాలయంలో హేమంత్ ఆచార్యుల యాజ్ఞిక నిర్వహణలో ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యుల వేదమంత్రోచ్ఛరణల నడుమ మహాపూర్ణాహుతి, చక్రతీర్థస్నవం, మహాకుంభప్రోక్షణ, వసంత ఉత్సవం (హోలీ) పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ నూకల రాంచంద్రారెడ్డి, ట్రస్ట్ బాధ్యులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు శ్రవణ్‌కుమారాచార్యులు, విజయ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుంకుమ పూజలు



గోపాలపురంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

గార్ల, మార్చి 26 : మండలంలోని గోపాలపురం గ్రామంలో శ్రీశీతల పరమేశ్వరి నాభిశిల బొడ్రాయి, ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్స కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలు పెద్దఎత్తున కుంకుమ పూజలను కన్నుల పండువగా జరుపుకున్నారు. గ్రామంలో చలువ పందిళ్లు వేసి గ్రామ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రవాస భారతీయుడు బత్తుల సత్యనారాయణ దంపతులు మాజీ సర్పంచ్ భూక్యా భారతి, మాజీ ఎంపీటీసీ తెల్లబోయిన వెంకటరమణ, గోపాలపురం ఎంపీటీసీ దనియకుల రాజకుమారి, గ్రామ పెద్దలు రావూల శ్రీనుయాదవ్, మీగడ శ్రీనువాస్, జంగాల మహేష్, గోసు నగేష్, సావిటి వీరయ్య, ఇమ్మడి రమేష్, గుడిచుట్ల నాగయ్య, బొబ్బ ఉపేందర్ రెడ్డి, ఇమ్మడి గోవింద, దనియాకుల రామారావు పాల్గొన్నారు.

బీఎస్పీ మానుకోట పార్లమెంటరీ ఇన్‌చార్జ్‌గా శివరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి26 : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన దార్ల శివరాజ్ నియామకమయ్యారు. శివరాజ్ గత 16 ఏళ్లుగా బీఎస్పీలో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. విద్యార్థి నాయకుడిగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో మహబూబాబాద్ కేంద్రంగా పోరాటాలు



శివరాజ్‌ను అభినందిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

నిర్వహించి, జైలు జీవితం గడిపారు. బీఎస్పీలో మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా, నూతన జిల్లా తొలి అధ్యక్షుడిగా, జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి అదనంగా మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకంతో ఇన్‌చార్జ్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ బాలయ్యకు శివరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నేత బాలుచౌహాన్‌కు పితృవియోగం

● ప్రముఖుల నివాళ్లు

సీరోలు, మార్చి 26 : తాళ్ల సంకీస వస్రాంతండాలోని స్వగృహంలో కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది మూడు బాలుచౌహాన్ తండ్రి లక్ష్మణ్ నాయక్ (90) సోమవారం మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు



లక్ష్మణ్‌నాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ దంపతులు

రాంచంద్రునాయక్-ప్రమీల దంపతులు, మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, తెలుగుదేశం పార్టీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండపల్లి రాంచందర్‌రావు వేర్వేరుగా మంగళవారం వస్రాంతండాకు చేరుకొని లక్ష్మణ్‌నాయక్ మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళ్లర్పించారు. అనంతరం బాలుచౌహాన్‌ను ఓదార్చారు. జిల్లా వైద్యాధికారి కళావతిబాయి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుగులోతు భీమానాయక్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, ఏబీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఇనుగుర్తి సుధాకర్, గుండెబోయిన సూరయ్య తప్పెట్ల వీరన్నలు మృతుడు లక్ష్మణ్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

● గిరిజన సంక్షేమ అడిషనల్ డైరెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి

నెహ్రూసెంటర్, మార్చి 26 : మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ అడిషనల్ డైరెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్



గిరిజన సంక్షేమ అడిషనల్ డైరెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నాయక్ మాట్లాడారు. డ్యూటీల పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెడుతూ ఎస్టీ కార్పొరేషన్, ట్రైకార్, ఈఎస్ఎఫ్ స్కాలర్‌షిప్‌ల పేరుతో అక్రమవసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌నాయక్, మోతీలాల్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు ఉడుత శ్యామ్‌యాదవ్

పెద్దవంగర, మార్చి 26 : ప్రధాని మోదీ సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉడుత శ్యామ్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో చిట్యాలకు చెందిన కొయ్యడి ముఖేష్, ఎల్‌బీ తండాకు చెందిన జాటోతు శంకర్‌ను మండల ప్రధాన కార్యర్శులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు



నియమాక పత్రాన్ని అందిస్తున్న ఉడుత శ్యామ్‌యాదవ్

ఉడుత శ్యామ్‌యాదవ్ మాట్లాడారు. గ్రామాల్లో బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేస్తూ బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. రాబోయే రోజుల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడోసారి బీజేపీ అఖండం విజయం సాధించడం ఖాయమన్నారు. గ్రామాల్లో యువత మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం, పార్టీ అభివృద్ధికి అందరి సమన్వయంతో పని చేయాలని సూచించారు.

మహిళలను కోటీశ్వరులు చేస్తాం..

● పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి..

● రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి

● పదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్

● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, మార్చి26 : మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. వడ్డీలేని రుణాలతోపాటు ప్రతి ఆడబిడ్డకూ రూ.10 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో మంత్రి సీతక్క మంగళవారం పర్యటించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సీతక్కతోపాటు కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ అండతో పదేళ్లుగా బీఆర్ఎస్ దోపిడీ చేసిందని ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఈరెండు పార్టీలకు ప్రజలకు గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వందరోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల పథకాలను ఆచరణలో పెట్టామని తెలిపారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10ల క్షలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను అమలులోకి తెచ్చామన్నారు. పేదలు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మద్దతు ధర కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలిపితే వారిపై తుపాకులు ప్రయోగించారని ధ్వజమెత్తారు. 2022 వరకు దేశంలో ఉన్న ప్రతిపేద కుటుంబానికీ ఇల్లునిర్మించి ఇస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పిందని దుయ్యబట్టారు. తెలంగాణ మాదిరిగానే కేంద్రంలో కూడా ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని, రాబోయేది కాంగ్రెస్ సర్కారేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్నికాంగ్రెస్ భారీ మెజారిటీతో కైవసం చేసుకోవాలన్నారు. ఇటీవల కొందరు తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలఅండ ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. బలరాంనాయక్ మాట్లాడుతూ గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన తాను ములుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేశానన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రోడ్లు, వంతెనల నిర్మాణం చేసినట్లు చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రవిచందర్, కిసాన్ కాంగ్రెస్‌అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, నాయకులు మల్లాడి రాంరెడ్డి, పన్నాల ఎల్లారెడ్డి, భైరెడ్డి భగవాన్‌రెడ్డి, రేగా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ములుగు, మార్చి 26 : రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన సంఘటన ములుగు పోలీస్‌స్టేషన్ పరిధి జవహర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పొడెం రఘు(30) పెయింటర్‌గా పని చేసున్నాడు.

తన మిత్రులతో కలిసి పదిరోజుల క్రితం ములుగుకు పెయింటింగ్ పని నిమిత్తం వచ్చాడు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.